సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 22 । నవంబర్ । 2022

కొత్తపల్లి జలపాతం వద్ద టీవీ నటుల సందడి

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం వద్ద సోమవారం టీవీ నటులు సందడి చేశారు. టీవీ నటుడు నాగుతోపాటు మరి కొంతమంది ఇక్కడ సుందరమైన జలపాత సోయగాలను, ప్రకృతి అందాలను ఆస్వాదించారు. తొలుత వీరిని వాటర్ ఫాల్స్ మేనేజర్ నవీన్, సూపర్ వైజర్ వి. అభి, సభ్యులు రాజు, పెద్దబ్బాయి, సురేష్, బాబూరావు జలపాత అందాలు చూపించారు.



దమ్మున్న పేసర్

- లైన్ అండ్ లెన్త్‌తో రాణిస్తున్న షబ్నమ్
- భారత్ అండర్–19 మహిళా జట్టులో విశాఖ అమ్మాయి



8లో

సదాశివునికి ప్రణమిల్లే..





పరమేశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసం చివరి సోమవారం జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలు భక్తులతో అలరారాయి. హరహరశంభో అంటూ శివుడ్ని స్తుతిస్తూ భక్తి సాగరంలో ఓలలాడారు. వేకువజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద కార్తీక దీపోత్సవం ఆకట్టుకుంది. శివ లింగం, ఓంకారం, తదితర ఆకృతుల దీపాలు దేదీప్యమానంగా వెలుగులీనాయి. - సాక్షి నెట్‌వర్క్



న్యూస్‌రీల్

వైఎస్సార్ సంచార పశువైద్యశాలలో ఉద్యోగావకాశాలు

హుకుంపేట: వైఎస్సార్ పశు వైద్యశాలలో డాక్టర్లు, టెక్నీషియన్లు, డ్రైవర్ల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు ఈఎంఆర్‌ఐ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనువాసులు తెలిపారు. వెటర్నరీ డాక్టర్ పోస్టుకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (రిటైర్డ్/ఫ్రెషర్ డాక్టర్లు), టెక్నీషియన్‌కు డిప్లొమా వెటర్నరీ సైన్స్, డ్రైవర్ పోస్టుకు పదో తరగతి పాసుతోపాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పని చేయాల్సి ఉందన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో విశాఖపట్నం పశు సంవర్ధక శాఖ కార్యాలయం, హనుమంతవాక విమ్స్ హాస్పిటల్ వద్ద ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9490088953 సంప్రదించాలని సూచించారు.

25లోగా కాఫీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్

చింతపల్లి: మన్యంలో 2023లో కాఫీ నాట్లు వేసుకొనేందుకు విత్తనాలు అవసరమైన రైతులు ఈ నెల 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్థానిక కాఫీ బోర్డ్ జేఎల్‌వో శ్రీరమణ సోమవారం తెలిపారు. కాఫీ నర్సరీల అభివృద్ధికి పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధి గిరిజన రైతులు చింతపల్లి, మినుములూరు, అరకువేలి కాఫీ బోర్డు కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులకు విత్తనాలు అందజేసేందుకు ఆర్‌వీనగర్ ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన సెలక్షన్ 5ఎ, 6, 8, 9, 11, 13 (చంద్రగిరి), రొబస్టా రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కిలోకు రూ.400 చెల్లించి పొందాలన్నారు.

చెత్త నిల్వపై కలెక్టర్ ఆగ్రహం



చికెన్ వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండల కేంద్రం శివారున జాతీయ రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతున్నట్లు గమనించిన కలెక్టర్ సుమీత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన పాడేరు నుంచి రంపచోడవరంలో సమావేశానికి వెళ్తూ ఈ దృశ్యాన్ని చూశారు. వెంటనే స్థానిక ఎంపీడీవో బాపన్నదొరకు ఫోన్ చేసి చెత్తను తొలగించాలని ఆదేశించారు. చికెన్ తదితర దుకాణదారులతో సమావేశమై రోడ్డుకు ఇరువైపులా చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దాంతో ఎంపీడీవో ఆ ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే చెత్త తొలగించాలని సంబంధిత కార్యదర్శి మల్లేశ్వరరావును ఆదేశించారు.

సోలార్ కంచెతో పంటలకు రక్షణ



కేవీకేలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం

రంపచోడవరం: పంటకు నష్టం కలిగించే జంతువులు, పక్షుల నుంచి పంటను కాపాడుకునేందుకు సోలార్ కంచెలు వాడుకోవాలని మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నామాల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పందిరిమామిడి కేవీకేలో పంటలలో సకశేరుకాల యాజమాన్యంపై ప్రదర్శన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని పంటలను కోతులు నాశనం చేస్తూ తీవ్ర నష్టాన్ని కలగచేస్తున్నాయని తెలిపారు. వీటి నివారణకు సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేవీకే ద్వారా అభివృద్ధి చేసిన సోలార్ కంచె విధానాన్ని, ఖర్చును రైతులకు కేవీకే కోఆర్డినేటర్ డాక్టరు లలితాకామేశ్వరి వివరించారు. తెగుళ్ల నివారణపై శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. చిరంజీవి అవగాహన కల్పించారు. కారక్రమంలో శాస్త్రవేత్తలు ప్రవీణ్‌బాబు, క్రాంతికుమార్, కె. లక్ష్మణ్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పరిశోధన పరిమళించే..

- ఆర్‌ఏఆర్‌ఎస్‌లో పూలసాగుపై అధ్యయనం
- ఆశాజనకంగా ప్రయోగాత్మక సాగు
- వచ్చే ఏడాది రైతులకు పరిచయం
- గంజాయి సాగు వైపు గిరిజనులు వెళ్లకుండా ప్రణాళికలు



విరబూసిన గ్లాడియోలస్



ఎరుపు జెర్బరా

చింతపల్లి రూరల్: పూలసాగుపై శాస్త్రవేత్తల పరిశోధనలు ఫలిస్తున్నాయి. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో తొలి ఏడాది ప్రయోగాత్మక సాగు ఆశాజనకంగా ఉండటంతో రెండో ఏడాది అధ్యయనం చేస్తున్నారు. ఇది ఫలప్రదమయ్యాక గంజాయి సాగు వైపు గిరిజన రైతులు వెళ్లకుండా వారి ఆర్థిక ప్రగతి లక్ష్యంగా అధిక లాభాలు వచ్చే పూలసాగును పరిచయం చేయనున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివాసీ రైతులకు గంజాయి ప్రత్యామ్నాయ పంటగా పూలసాగును పరిచయం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. దీనికి చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ముందడుగు వేశారు. జిల్లా వాతావరణం, ఇక్కడ నేలలు పూలసాగుకు అనుకూలమని గుర్తించారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో అధిక డిమాండ్ కలిగిన అరుదైన పూలసాగుపై పరిశోధనలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు.

బెంగళూరు, ఢిల్లీ నుంచి...

2021లో తొలి సారిగా బెంగళూరు, ఢిల్లీ నుంచి మార్కెట్‌లో అత్యధిక డిమాండ్ కలిగిన అరుదైన పూల మొక్కలను దిగుమతి చేసుకుని ప్రయోగాత్మక సాగు ప్రారంభించారు. ప్రధానంగా నేల సంపంగి, చామంతి, చైన ఆస్టర్, గ్లాడియోలస్, లిల్లియం, జెర్బరా, తులిప్, మేరీగోల్డ్ మొక్కలను గతడాది ఆగస్టులో నాటారు. వీటిలో గ్లాడియోలస్, మేరీగోల్డ్, చైన ఆస్టర్, లిల్లియం, జెర్బరా పూలమొక్కలు విరబూశాయి. ఇవి మేలుజాతిగా ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



విరబూసిన లిల్లియం

రెండో ఏడాది పూల సాగు...

తొలి ఏడాది ప్రయోగాత్మక సాగు ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో రెండో ఏడాది పూల సాగుపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. పరిశోధన స్థానంలో సెప్టెంబరులో గ్లాడియోలస్‌లో మూడు రకాలు, జెర్బరా, చైనా ఆస్టర్, లిల్లియం, తులిప్ పూల మొక్కల నాట్లు వేశారు. ప్రస్తుతం గ్లాడియోలస్, జెర్బరా, లిల్లియం పూలు పూత కొచ్చాయి. గ్లాడియోలస్ తెలుపు, ఊదా, ఎరుపు వర్ణం పూలు, లిల్లియం, జెర్బరా పూలు ప్రస్తుతం సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

అభ్యుదయ రైతులతో పూలసాగు



వచ్చే ఏడాది పూల సాగును రైతులకు పరిచయం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రెండో ఏడాది పరిశోధన స్థానంలో ప్రయోగాత్మక పూల సాగు చేపడుతున్నాం. ఈ ఏడాది తొలిసారిగా లంబసింగి, అరకువేలిలో అభ్యుదయ రైతులతో ఎకరా విస్తీర్ణంలో గ్లాడియోలస్ పూల సాగు చేపట్టనున్నాం. ఈ ఏడాది పరిశోధన స్థానంలో అగ్రి టూరిజం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. పరిశోధన స్థానాన్ని సందర్శించే పర్యాటకులు ఆర్‌ఏఆర్‌ఎస్‌లో సాగుచేస్తున్న వివిధ పంటలు, పూల సాగు, మిశ్రమ సేద్యం, ఔషధ మొక్కల ప్లాంటేషన్ వీక్షించవచ్చు. వ్యవసాయంపై ప్రజలకు ఆసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం.

– డాక్టర్ ఎం. సురేశ్ కుమార్, ఏడీఆర్, ఆర్‌ఏఆర్‌ఎస్, చింతపల్లి

గోదావరిలో నిలిచిన పర్యాటక బోటు



పోశమ్మగండి బోట్ పాయింట్‌కు చేరుకున్న పర్యాటకులు

- పంకాకు చుట్టుకున్న చేపల వల
- బోట్ పాయింట్‌కు సురక్షితంగా చేరుకున్న పర్యాటకులు

దేవీపట్నం: పాపికొండలుకు పర్యాటకులతో వెళ్లిన బోటు.. పంకాకు వల చిక్కుకుని నిలిచిపోయింది. తిరిగి పోశమ్మగండి బోటు పాయింట్‌కు చేరుకునేందుకు సుమారు నాలుగు గంటల పైనే సమయం పట్టింది. వివరాలు.. పోశమ్మ గండి బోటు పాయింట్ నుంచి సోమవారం ఉదయం 40 మంది పర్యాటకులతో వెళ్లిన ఆదిత్య బోటు తిరుగు ప్రయాణంలో బోటు పంకాకు (బోటు వెనుక భాగంలో నీటిలో ఉండేది) వల చుట్టుకోవడంతో నిలిచిపోయింది. సాయంత్రం 6.30 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వాడపల్లి సమీపంలో ఈ సంఘటన జరగడంతో ఎస్కార్ట్ బోటులోని వారు పోశమ్మగండి బోట్ పాయింట్‌కు చేరుకుని కంట్రోల్ రూమ్‌లోని అధికారులకు సమాచారాన్ని అందించారు. దీంతో వారు నిలిచిపోయిన బోటులోని పర్యాటకులను తీసుకువచ్చేందుకు మరో బోటును పంపించారు. అయితే నిలిచిపోయిన ఆదిత్య బోటు పంకాకు చుట్టుకున్న వలను తీసివేయడంతో.. బోటు కదిలి పర్యాటకులతో సురక్షితంగా పోశమ్మగండి బోటు పాయింట్‌కు రాత్రి 10.20 గంటలకు చేరుకుంది. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం రెండు బోట్లు పర్యాటకులతో వెళ్లాయి. ఒక బోటు సమయానికే బోటు పాయింట్‌కు చేరుకుంది.

ఇన్ఫోసిస్ కోసం చకచకా!

- ఐటీ సెజ్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు
- వీధి దీపాల మెరుగుకు చర్యలు
- ఆ మార్గంలో సెక్యూరిటీ పెంపు
- పెట్రోలింగ్ నిర్వహించనున్న పోలీసులు



ఇన్ఫోసిస్ లోగో



ఇన్ఫోసిస్ కార్యకలాపాలు చేపట్టనున్న ఐటీ సెజ్‌లోని మహతి సొల్యూషన్స్ ప్రాంగణం

సాక్షి, విశాఖపట్నం: దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ విశాఖలో పూర్తి స్థాయి కార్యకలాపాలు చేపట్టడానికి అవసరమైన చర్యలను జిల్లా యంత్రాంగం చకచకా తీసుకుంటోంది. ఇప్పటికే విశాఖ రుషికొండ ఐటీ సెజ్‌లో అక్టోబర్ ఒకటిన ఇన్ఫోసిస్ శాటిలైట్ కార్యాలయాన్ని తెరిచింది. త్వరలోనే ఈ ఐటీ సెజ్ నుంచి ఉద్యోగులు విధులు నిర్వహించడానికి ఇన్ఫోసిస్ సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తమకు అవసరమైన వనరులు, సదుపాయాల గురించి ఇన్ఫోసిస్ ప్రతినిధులు పరిశ్రమల శాఖ, ఆర్టీసీ, పోలీసు, జీవీఎంసీ తదితర అధికారులతో ఇటీవల చర్చించారు. నగరం నుంచి రుషికొండ ఐటీ సెజ్‌కు ఆ సంస్థ ఉద్యోగులు రాకపోకలు సాగించడానికి వీలుగా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఇందుకు ఆర్టీసీ అధికారులు సమ్మతిని తెలియజేశారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారు. అందువల్ల 24 గంటలూ బస్సు సర్వీసులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. ఇన్ఫోసిస్ అవసరాలకు ప్రత్యేకంగా బస్సులను కేటాయించడానికి కూడా తమకు అభ్యంతరం లేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఐటీ సెజ్‌కు ఎన్ని బస్సుల అవసరం అన్నది ఉద్యోగుల సంఖ్యను బట్టి ఉంటుందని, దీనిపై కొద్ది రోజుల్లోనే స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. జనవరి నాటికి తమకు బస్సుల అవసరం ఉంటుందని ఇన్ఫోసిస్ ప్రతినిధులు చెప్పారని, కావలసినన్ని బస్సులను నడపడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

రోడ్లకు మరమ్మతులు.. వీధిలైట్లు..

మరోవైపు భీమిలి వెళ్లే బీచ్ రోడ్డు నుంచి ఐటీ సెజ్‌కు వెళ్లే రోడ్డు మరింత మెరుగు పరచడంతో పాటు మరమ్మతులు చేపట్టేందుకు జీవీఎంసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. అలాగే రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడకుండా ఆ రోడ్డుకు ఇరువైపులా పూర్తి స్థాయిలో వీధి లైట్లను ఏర్పాటు చేయనున్నారు.

భద్రతకు పెద్దపీట

ఐటీ సెజ్‌కు వెళ్లే దారిలో భద్రత (సెక్యూరిటీ)పై కూడా దృష్టి సారిస్తున్నారు. ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలను, ఆకతాయిలు, తాగుబోతులు, అల్లరి మూకల ఆగడాలను కట్టడి చేయడానికి పోలీసులు చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం పోలీసులతో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో ఇన్ఫోసిస్‌తో పాటు ఐటీ సెజ్‌లో విధులు నిర్వహించడానికి వెళ్లి వచ్చే ఉద్యోగినులు ఎలాంటి భయాందోళనలకు ఆస్కారం లేకుండా చూస్తారు. త్వరలో విశాఖ క్యాంపస్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు పరిశ్రమల శాఖ నుంచి అన్ని ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.రామలింగేశ్వరరాజు 'సాక్షి'కి చెప్పారు. ఇందుకోసం సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నామని తెలిపారు.

25 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం



రంపచోడవరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

- జిల్లాలో 56 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- రంపచోడవరంలో అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్ష




సమీక్షకు హాజరైన అధికారులు

రంపచోడవరం: జిల్లాలో ఈ ఏడాది 25 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఐటీడీఏ సమావేశపు హాలులో పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి 11 మండలాల వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 56 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో 112 మంది రైతు సహాయకులు, 56 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమిస్తున్నామన్నారు. ఆయా కేంద్రాలకు టెస్టింగ్ పరికరాలు సరఫరా చేస్తామన్నారు. ధాన్యాన్ని అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు, ధాన్యం తరలించే లారీ యాజమానులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రూట్ అధికారులుగా వలంటీర్లు పని చేస్తారన్నారు. ధాన్యం అమ్మిన రైతుతో అగ్రికల్చర్ అసిస్టెంట్, వలంటీర్ కలిసి ఫొటో తీసుకుని అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ధాన్యం తీసుకున్న వెంటనే రైతుకు రసీదు ఇవ్వాలన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ పరిధి డిపోల్లో గోనె సంచులను తహసీల్దార్లు తమ ఆధీనంలో పెట్టుకోవాలని తెలిపారు. సుమారు లక్ష గోనె సంచులు అవసరముందన్నారు. అనంతరం జిల్లాలో వరి సాగుపై వ్యవసాయ అధికారులతో కలెక్టర్ చర్చించారు. ప్రతి రైతుకు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. 600 గ్రామాల్లో వరి సాగు చేసిన రైతులకు ధాన్యం అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుపై రంపచోడవరం, చింతూరు సబ్ కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జేసీ శివశ్రీనివాస్, చింతూరు పీవో పర్మన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ అనుతోష్ శ్రీవాస్తవ, జీసీసీ అధికారులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో పెరిగిన ఉష్ణోగ్రతలు

- చింతపల్లిలో 17.2 డిగ్రీలు
- అరకులోయలో 15 డిగ్రీలు
- మినుములూరులో 13 డిగ్రీలు



పాడేరు ప్రాంతంలోని ఆకాశంలో మబ్బులు

సాక్షి, పాడేరు: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వాతావరణంలో మార్పులు నెలకొన్నాయి. ఆదివారం వరకు ఏజెన్సీలో 10 డిగ్రీలు లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదై చలిగాలులు విజృంభించాయి. పొగమంచు కూడా దట్టంగా కురిసేది. సోమవారం ఉదయం నాటికి మన్యంలోని ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 17.2 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 15 డిగ్రీలు, మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 13 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఉదయాన్నే పొగమంచు తక్కువగానే ఉంది. సాయంత్రం వరకు ఎండ లేకపోగా, ఆకాశమంత మబ్బులు పట్టాయి. కొన్నిచోట్ల తుంపర్ల వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో చలిగాలుల తీవ్రత తగ్గింది.

నేడు జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ ఉత్తర): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్. సుబ్బిరెడ్డి తెలిపారు. ఐదు ప్రముఖ కంపెనీల్లో 200 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, ఎంబీఏ డిప్లమోలో ఉత్తీర్ణత సాధించి 18–40 సంవత్సరాల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు.

ఆయా ఉద్యోగాన్ని బట్టి నెలకు జీతం రూ.10,500 నుంచి రూ. 20,500 మధ్య ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విశాఖపట్నం, గాజువాక ప్రాంతాల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు.

వ్యవసాయ పనుల్లో విద్యార్థులు


వరి కోతల్లో విద్యార్థులు

చింతపల్లిరూరల్: స్థానిక డీగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో డిగ్రీ విద్యార్థులు వరి కోతలు కోతలు, నూర్పు పనులు చేపట్టారు. చింతపల్లి డీగ్రీ కళాశాలలో బీఎస్సీ(సీబీజెడ్) విద్యార్థులు 24 మంది స్థానిక ప్రాంతీయ వ్యవశాయ పరిశోధన స్థానంలో ఇంటర్న్‌షిప్‌కు వచ్చారు.ఇందులో భాగంగా ఔషధ మొక్కలు, పూల సాగు, వరి సాగు విధానాలను తెలుసుకున్నారు. ఈ మేరకు విద్యార్థులు కోతకు వచ్చిన వరి పొలాలను కోసి నూర్పుకి తరలించారు. స్థానిక ఏడీఆర్ ఎం.సురేష్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్త సీతారామ్ తదితరులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాలు అందజేస్తామని ఏడీఆర్ సురేష్‌కుమార్ చెప్పారు.

మాడగడ హిల్స్ అందాలు అద్భుతం

పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు : అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


మాడగడ హిల్స్‌లో పొగమంచు, మేఘాల అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు


అధికారులు, పర్యాటకులతో కలిసి మాడగడలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: అరకులోయ ప్రాంతంలోని మాడగడ హిల్స్‌లో పొగమంచు, మేఘాల అందాలు అద్భుతంగా ఉన్నాయని, పర్యాటకులంతా భారీగా ఇక్కడకు తరలివస్తుండడం సంతోషంగా ఉందని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పలువురు అధికారులు, స్థానికులతో కలిసి ఆయన సోమవారం ఉదయాన్నే మాడగడ హిల్స్‌కు చేరుకున్నారు. ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షించి పరవశించారు. పాల సముద్రంలా పొగమంచు కొండలను తాకిన దృశ్యాలు పర్యాటకులందరిని ఎంతో ఆకర్షించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ వాహనాలు దిగగానే ప్రకృతి అందాలు పర్యాటకులకు స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఇంత అద్భుతమైన మాడగడ హిల్స్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై పర్యాటక, ఐటీడీఏ అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరకులోయ సీఐ జి.దేముడుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మోటార్ యూనియన్ నేత ముఖీ చినసాంబ, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ సేవలు


సంతలో పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్పీఎఫ్ డి-42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటమణ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ఏఎస్పీ మహేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

కూనవరం: విలీన మండలాల్లో యువత ఇటీవల ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన 28 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని చింతూరు డివిజన్ ఏఎస్పీ మహేశ్వర రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ మైదానంలో స్ఫూర్తి కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు రాత పరీక్షకు మూడు నెలల ముందు శిక్షణ ఇప్పించేందుకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. తద్వారా ఎంపికైన వారికి భోజనం అన్ని వసతులు కల్పించి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తామన్నారు. అభ్యర్థులు స్థానిక పోలీసు స్టేషన్‌కు వస్తే తమ సిబ్బందే ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తారని తెలిపారు. బయట చేయించుకున్న వారు ఐడీ నంబరు తెలియజేస్తే రిజిస్టర్‌లో ఎంటర్ చేస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 200పైగా దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎటపాక సీఐ గజేంద్రకుమార్, కూనవరం, వీఆర్‌పురం ఎస్సైలు బి. వెంకటేష్, తెల్లం దుర్గాప్రసాద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిబిరానికి అరుణ్ ఎంపిక


అరుణ్

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈస్టన్ నావల్ కమాండెంట్ విశాఖపట్నంలో నిర్వహించే ఎన్‌సీసీ సముద్ర అనుసంధాన శిబిరం–2022కి అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యార్థి ఎంపికయ్యారు. డిప్లమో మెకానిక్ రెండవ సంవత్సరం చదువుతున్న రొంగలి అరుణ్ ఈనెల 22 నుంచి డిసెంబర్ 2 వరకూ నిర్వహించే శిబిరంలో పాల్గొననున్నాడు. శిబిరంలో ప్రతిభ కనబరిచిన వారు డిసెంబర్ 4న నిర్వహించే విన్యాసాల్లో పాల్గొనే అవకాశం పొందనున్నారు. స్విమ్మింగ్ కేటగిరీలో ఎన్నికయిన తమ విద్యార్థికి మరిన్ని అవకాశాలు రావాలని కళాశాల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఆకాంక్షించారు.

నేడు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర పర్యటన

- పానిరంగినిలో పెట్రోల్ బంక్
- జైపూర్ జంక్షన్‌లో గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల భవనాలు ప్రారంభానికి సిద్ధం
- ఏర్పాట్లపై ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమీక్ష


పానిరంగినిలో ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, అరకులోయ ఎమ్మెల్యే పాల్గుణ

సాక్షి, పాడేరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర మంగళవారం మన్యంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అరకులోయ మండలం పానిరంగిని గ్రామ సమీపంలో పెట్రోల్ బంక్‌ను, డుంబ్రిగుడ మండలం జైపూర్ జంక్షన్ వద్ద నిర్మించిన కిల్లోగూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల భవనాలను ఆయన ప్రారంభిస్తారు. అనంతరం సమావేశంలో ప్రసంగిస్తారు. ఆయా చోట్ల ఏర్పాట్లను ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం సాయంత్రం పరిశీలించారు. గిరిజన సంక్షేమ ఈఈ వేణుగోపాల్, ఇతర అధికారులతో సమీక్షించారు. పోలీసు శాఖ కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది.

జైపూర్ జంక్షన్‌లో ఆకర్షిస్తున్న అందమైన భవనం

జైపూర్ జంక్షన్ వద్ద కిల్లోగుడలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు అధునాతన సౌకర్యాలతో సొంత భవనం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.376.40 లక్షలతో 14,926 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్పొరేట్‌కు దీటుగా పాఠశాల భవనం, అదనంగా భోజనశాలను నిర్మించింది. ఇది చూపరులను ఎంతో ఆకర్షిస్తుంది. ఇక్కడ 3 నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం చదివే గిరిజన బాలికలకు పూర్తిస్థాయిలో సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. ఈ భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించనుండటంతో గిరిజనులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ప్రారంభం కానున్న కిల్లోగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల భవనం

108 వాహనంలో సుఖ ప్రసవం


కుటుంబ సభ్యులకు శిశువును అందజేస్తున్న ఈఎంటీ రామకృష్ణ

జి.మాడుగుల: మండలంలో పోర్లు గ్రామానికి చెందిన గర్భిణి పాంగి మంజుల సోమవారం 108 వాహనంలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో జర్రాయి వద్ద శిశువు పేగు చుట్టుకుని ప్రసవించినట్లు ఈఎంటీ బి. రామకృష్ణ, పైలట్ పి. లక్ష్మణరావు తెలిపారు. మంజులకు ఇది మొదటి కాన్పు అని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామన్నారు.

సారా స్వాధీనం: ఇద్దరి అరెస్టు

పాడేరు రూరల్: హుకుంపేట మండలం చీడిపుట్టులో సోమవారం పాడేరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఏపీఎస్పీ స్పెషల్ టీం సిబ్బంది దాడులు నిర్వహించారు. చీడిపుట్టు గ్రామానికి చెందిన ఆర్.భారతీదేవి, బి.అచ్చిబాబుల నుంచి 500 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


కేవీకేలో జరిగిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి

రంపచోడవరం: ఏజెన్సీ వాసుల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని, తమ సర్వే ద్వారా గుర్తించామని లయ సంస్థ కోఆర్డినేటర్ కె కోటేశ్వరరావు తెలిపారు. లయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీల పౌష్టికాహార అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో ముంబయికి చెందిన న్యూట్రిస్టు డాక్టర్ సుభద్ర, కాకినాడకు చెందిన డాక్టర్ అనంతలక్ష్మి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ లలితాకామేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయ కోఆర్డినేటర్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 24 రికాల్ పామ్స్, ఫుడ్ ఫ్రీక్వెన్సీ పద్ధతుల ద్వారా 200 మందిని సర్వే చేశామన్నారు. ఇందులో రక్తహీనత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లకు పౌష్టికాహారం ఏ విధంగా తీసుకోవాలి, సమతుల్య ఆహారం ఏ విధంగా తీసుకోవాలి, చిరుధాన్యాల ఎక్కువగా తీసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయ మహిళా కోఆర్డినేటర్ ఏ పద్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అర్చకుడి మృతి


సుబ్రహ్మణ్యశాస్త్రి(ఫైల్)

ఎటపాక: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి(53) సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నెల 19న ఆయన తన ద్విచక్రవాహనంపై కుమారుడిని ఎక్కించుకుని భద్రాచలం వెళ్లాడు. అక్కడ తన కుమారుడిని తిరుపతి బస్సు ఎక్కించి ఇంటికి సాయంత్రం 6 గంటల సమయంలో తిరుగు పయనమయ్యాడు. ఈక్రమంలో రాయనపేట వద్ద జాతీయ రహదారిపై చిన్న గంతలో ద్విచక్రవాహనం దిగటంతో అదుపుతప్పి బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనంలో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ మృతి చెందాడు.

ఏకలవ్య పాఠశాల వసతిపై స్పందించిన కలెక్టర్

ఆయన ఆదేశాలతో భవనాలను పరిశీలించిన గురుకుల అధికారులు


ఎంపీడీవో కార్యాలయం వద్ద అధికారులు

కొయ్యూరు: ఏకలవ్య పాఠశాల వసతి సమస్యపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించారు. ఈ మేరకు మండలంలో అనుకూలమైన భవనాలను పరిశీలించి నివేదించాలని గురుకుల కన్వీనర్, ఓఎస్‌డీ పీఎస్ఎన్ మూర్తిని ఆదేశించారు. ఆ మేరకు ఈఎంఆర్ పాఠశాలల కన్వీనర్ రమణ, కొయ్యూరు ప్రిన్సిపాల్ విఠల్, ఎంపీపీ బడుగు రమేష్, గురుకుల వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌లతో కలిసి ఓఎస్డీ మూర్తి స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. కాకరపాడులో పోస్టుమెట్రిక్ బాలికల హాస్టల్ భవనాన్ని సందర్శించారు. అక్కడ 12 గదులు, 70 మంది బాలికలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇక్కడ అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. అదనంగా టాయిలెట్లు మాత్రమే అవసరమవుతాయి. ఈ పరిశీలన అనంతరం ఓఎస్‌డీ మూర్తి మాట్లాడుతూ తాము ఇచ్చిన నివేదికపై కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. ఇదిలావుంటే కొయ్యూరు గురుకుల పాఠశాలలో ఏకలవ్య 6, 7 తరగతుల బాలురుకు, చింతపల్లి వైటీసీలో బాలికల 6, 7 తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో వీరి తల్లిదండ్రులు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన ఏదో ఒక భవనాన్ని నిర్ణయించాలని ఆదేశించారు. బాలారం సమీపంలో ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి 15 ఎకరాలు కేటాయించారు. కాంట్రాక్టర్ వేసిన టెండర్ రద్దు కావడంతో తిరిగి ఎవరూ వేయలేదు.

దమ్మున్న పేసర్

గవాస్కర్, సచిన్ క్రికెట్‌లోకి కొడుకుల్నే పంపించారు కాని కూతుళ్లను పంపించలేదుగా.. మరి వాళ్లకంటే ఎక్కువా.. ఈ షకీల్? అంటే ఔననే సమాధానం వస్తోంది. తన కుమార్తె క్రికెట్ మైదానంలో మెరిసిపోవాలని కలలుగన్నాడు. కుమార్తె ఆసక్తిని గమనించి ప్రోత్సహించాడు. 'క్రికెట్ చాలా కష్టమైన ఆట.. సున్నితంగా ఉండే అమ్మాయిలు అస్సలు ఆడలేరు'.. కానీ ఆటను ఆస్వాదిస్తే, ప్రేమిస్తే ఎటువంటి క్రీడల్లోనైనా రాణించవచ్చని విశాఖకు చెందిన షబ్నమ్ నిరూపించింది. ఏకంగా భారత్ అండర్-19 మహిళా జట్టులో స్థానం సంపాదించుకుంది. విశాఖ ఆణిముత్యం షబ్నమ్‌పై ప్రత్యేక కథనం.

- లైన్ అండ్ లెన్త్‌తో రాణిస్తున్న షబ్నమ్
- భారత్ అండర్-19 మహిళా జట్టులో విశాఖ అమ్మాయి

విశాఖ స్పోర్ట్స్ : ఎనిమిదేళ్ల ప్రాయంలో సరదాగా తండ్రి షకీల్‌తో రన్నింగ్‌కు వెళ్లేది షబ్నమ్. తండ్రి క్రికెటర్. ఫిట్‌నెస్ కోసం రోజూ రన్నింగ్, వ్యాయామం చేసేవాడు. ఈ క్రమంలో కొందరు ఆడపిల్లలు క్రికెట్ ఆడడాన్ని షబ్నమ్ చూసింది. వారు ఆడుతున్న విధానాన్ని ఎంతో ఆసక్తిగా గమనించేది. ఇది చూసిన షకీల్ తన కుమార్తెను క్రికెట్‌లో ప్రోత్సహించాడు. ఆటలో మెలకువలు నేర్పాడు. ఇలా చిన్నచిన్న టోర్నమెంట్ల నుంచి ఇప్పుడు ఏకంగా జాతీయ అండర్ -19 మహిళా జట్టులో స్థానం సంపాదించుకుంది. భారత్ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్ మహిళల అండర్-19 జట్టు సిరీస్ ఆడనుంది. టోర్నమెంట్‌లో తన పేస్‌తో బెంబేలెత్తించేందుకు షబ్నమ్ సిద్ధమైంది. 2017 నుంచి సీరియస్‌గా క్రికెట్‌లో శిక్షణ పొందుతోంది. కోచ్ నాగరాజు సలహాలతో మంచి క్రికెటర్‌గా తక్కువ కాలంలో ఎదిగింది.

బరిలో దిగితే వికెట్లు పడాల్సిందే..

షబ్నమ్ మంచి పేస్ బౌలర్. బ్యాటర్‌ను ముప్పతిప్పలు పెట్టించగలదు. బౌలింగ్‌లో చాలా వేరియేషన్స్ ఈమె ప్రత్యేకం. అందుకే తక్కువ సమయంలో గుర్తింపు పొందింది. బరిలోకి దిగిన ప్రతి సారి వికెట్లు పడగొడుతూ మేటి బౌలర్‌గా మారింది. ఈమెను గుర్తించి భారత్ అండర్-19 జట్టుకు ఎంపిక చేశారు.

2019లో జిల్లాకు ప్రాతినిధ్యం

2019లో అండర్-16లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరుకుంది షబ్నమ్. వేసవి శిబిరాల్లోనే జట్టుగా ఆడేప్పుడే పేస్ బౌలింగ్ వైపు ఆసక్తి పెరిగింది. పేస్‌లో వేరియేషన్స్‌తో జట్టుకు కీలకంగా మారింది.

సీనియర్ ఆటగాళ్లకు బౌలింగ్

రైల్వేస్ జట్టు విశాఖలోనే ప్రాక్టీస్ చేసేందుకు వచ్చింది. కొందరు జాతీయ జట్టుకు ఆడుతున్నారు. ప్రాక్టీస్‌లో భాగంగా నెట్‌బౌలర్‌గా అవకాశం చిక్కింది. సీనియర్ ఆటగాళ్లకు బౌలింగ్ చేయడంతో మరింత మెరుగుపడింది. అలా వారికి బౌలింగ్ చేస్తూ వెనక్కి వెళుతున్న సమయంలో మరో బౌలర్ వేసిన బంతిని నెట్స్‌లో బ్యాటర్ హిట్ చేయగా అది వచ్చి చెవికి తగిలింది. ఒక్కసారిగా స్పృహ కోల్పోయింది. అయితే మైదానంలో ఎంత అలర్ట్‌గా ఉండాలనే విషయం అక్కడ అర్థమైందని షబ్నమ్ చెప్పింది.

స్కూల్ నేషనల్స్

కరోనాతో శిక్షణ, పోటీలకు బ్రేక్ వచ్చింది. తిరిగి 2022లో పోటీలు ప్రారంభం కావడంతో దేశవాళీ క్రికెట్‌లో అన్ని ఫార్మేట్స్ షబ్నమ్ సత్తా చాటుకుంది. చాలెంజర్ ట్రోఫీతో పాటు స్కూల్ గేమ్స్ నేషనల్స్ అండర్ 17 జట్టుకు ఆడింది. రెండు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొంది.



24న ముంబై బయలుదేరుతున్నా..

ఇటీవల క్వాడ్రేంగులర్ సిరీస్‌లో భాగంగా శ్రీలంక, వెస్టిండీస్‌తో తలపడిన భారత్ బీ జట్టు తరపున రెండు మ్యాచ్‌లు ఆడా. ఇప్పుడు ఏకంగా భారత్ మహిళా అండర్-19 జట్టు తరపునే ఆడే అవకాశం దక్కడం నిజంగా అదృష్టమే. ఈనెల 24న ముంబై బయలుదేరుతాను. పేస్‌కు మరింత వేగం పెంచి రాణిస్తాను. జాతీయ జట్టులో స్థానం సాధించడమే లక్ష్యం.
– షబ్నమ్, మహిళా క్రికెటర్

స్వాతంత్య్ర పోరాట యోధుల ఆశయాలు స్ఫూర్తిదాయకం

అరకులోయ రూరల్: స్వాతంత్య్ర పోరాట యోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన స్వచ్ఛతా అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అధికారులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, చట్టాలపై బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటలు చేసిన సమరయోధుల ఆశయాలను ప్రజలకు మరింత స్ఫూర్తి కలిగించాలన్నారు. గిరిజన స్వాతంత్య్ర పోరాట యోధుడు బిర్సా ముండా జయంతి వేడుకలో భాగంగా గిరిజనుల విజయాలు, సంస్కృతిని స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, సీడీపీవో శారదా, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పీపీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, కోఆప్షన్ సభ్యుడు రహీంతుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టి అప్పాలు, నర్సింగ్, రమేష్, సాంబ పాల్గొన్నారు.